యూనిట్ III

# 8. హరిశ్చంద్రుడు

– గౌరన

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

బలి చక్రవర్తి గొప్పదాత. అతడు ఒకసారి యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞవేదిక దగ్గర దానధర్మాలు చేస్తున్నాడు. వామనుడు దానం స్వీకరించడానికి వచ్చాడు.

| | | |
|---|---|---|
| బలి | : | ఏం కావాలి? |
| వామనుడు | : | మూడడుగుల నేల. |
| బలి | : | తప్పక ఇస్తాను. |
| శుక్రాచార్యుడు | : | బలీ! వద్దు! వద్దు!<br>వచ్చినవాడు రాక్షస విరోధి!<br>అతనికి దానం ఇస్తే నీకే ప్రమాదం! |
| బలి | : | గురువర్యా! నేను ఆడిన మాట తప్పను.<br>వామనా! మూడడుగుల నేల గ్రహించు. |

### ప్రశ్నలు

1. బలిని దానం ఇవ్వవద్దని ఎవరన్నారు? ఎందుకన్నారు?
2. దానం ఇస్తే ఎవరికి ప్రమాదం?
3. బలిచక్రవర్తి గొప్పదనం ఏమిటి?
4. ఆడిన మాట తప్పనివారి గురించి మీకు తెలుసా?

### నేపథ్యం

ఒకసారి దేవేంద్రుడు కొలువుదీర్చి ఉన్నాడు. 'మూడులోకాలలో ఎవరైనా బొంకని వారున్నారా? ఇప్పుడు జీవించి ఉన్న వారిలో కానీ గతకాలం వారిలో కానీ అసత్యమాడని వారున్నారా? భవిష్యత్తులో ఎవరైనా ఉంటారా?' అని త్రికాలజ్ఞులైన మునీశ్వరులను అడిగాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. కొంత మంది విన్నా విననట్లు ఊరుకున్నారు. కానీ వశిష్ఠుడూరుకోలేదు. హరిశ్చంద్రుడు అటువంటి ఉత్తమ లక్షణాలు కలవాడని సభలో ప్రకటించాడు. ఆ లక్షణాలు ఏమిటో ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.

**ప్రస్తుత పాఠ్యభాగం గౌరన రచించిన "హరిశ్చంద్రోపాఖ్యానము" లోనిది.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.


© SCERT not to be republished

నిరుపమ విజ్ఞాననిధి వసిష్ఠుండు
పురుహూతు తోడ నద్భుతముగాఁ బలికె
వినుము సురేంద్ర యీ విశ్వంబుఁనందు
వినుతి కెక్కిన మహావిక్రమోన్నతుఁడు
తనరు షోడశమహాదాన వినోది
వినయభూషణుఁడు వివేకసంపన్నుఁ
డతుల సత్కీర్తి మహాభాగ్యశాలి
వితత ధనుర్వేద విద్యాధికుండు
కరుణాపయోనిధి గాంభీర్యఘనుఁడు
దురితదూరుఁడు బుధస్తోత్రపాత్రుండు
సర్వ శాస్త్రార్థ విచారకోవిదుఁడు
గర్వితరిపుగజ కంఠీరవుండు
వరుస నార్వురు చక్రవర్తులలోనఁ

దరమిడి మున్నెన్నఁదగు చక్రవర్తి
నిత్యప్రసన్నుండు నీతిపాలకుడు
సత్యసంధుండు త్రిశంకు నందనుఁడు
నిరుపమ విజ్ఞాననిధి భానువంశ
శరధిచంద్రుఁడు హరిశ్చంద్రుఁడన్ రాజు
పోఁడిమి మదిఁ దలపోసి చూచినను
వాఁడెపో బొంకని వాడు దేవేంద్ర
.................................
అల రెండువేల జిహ్వాల వానికైనఁ
గొలఁదె హరిశ్చంద్రు గుణములు వొగడ
దను వెల్ల సత్యంబు తల పెల్లఁగరుణ
పను లెల్ల ధర్మంబు పలు కెల్లఁ బ్రియము
బొంకు నాలుకకు జేర్పుట కాని వావి



యింక నన్నియుఁ జెప్ప నేమి కారణము
వారిజ గర్భుని వ్రాఁత దప్పినను
వారిజాప్తుఁడు దూర్పువంకఁ గ్రుంకినను
మేరువు గ్రుంగిన మిన్ను వ్రాలినను
ధారుణీచక్రంబు తలక్రిందు వడిన
వారిధు లింకిన వజ్రాయుధంబు
ధార దప్పిన మాట తప్పుఁడా రాజు.



© SCERT not to be republished

## కవి పరిచయం

ద్విపదకు పునర్జీవనం పోసిన గౌరన 15వ శతాబ్దికి చెందినవాడు. హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర రచించాడు. సంస్కృతంలో 'లక్షణ దీపిక' అనే గ్రంథాన్ని రచించాడు. ఈయనకు 'ప్రతివాద గజపంచాననుడు', 'చతురసాహిత్య లక్షణ చక్రవర్తి' అనే బిరుదులున్నాయి. ఈయన శైలి మనోహరమైనది. సామెతలు, జాతీయాలతో కవిత్వం అలరారుతుంది. అచ్చతెలుగు పలుకుబళ్ళు కవిత్వం నిండా రసగుళికల్లా జాలువారుతాయి. పదప్రయోగాలలో నైపుణ్యం అడుగడుగునా కనపడుతుంది.

### ప్రక్రియ - ద్విపద

ద్విపద రెండు పాదాలు ఉన్న పద్యం. ఇది జాతి పద్యం. గానయోగ్యమైంది.

© SCERT not to be republished

## సారాంశం

త్రికాలజ్ఞుడైన వశిష్ఠుడు ఇంద్రుడితో ఇలా అన్నాడు. ఓ దేవేంద్రా! ఈ ప్రపంచంలో మహా పరాక్రమవంతుడు హరిశ్చంద్రుడు. ఇతడు పదహారు రకాల దానాలు చేస్తూ ఆనందిస్తాడు. వినయమే అలంకారంగా కలవాడు. వివేకమే సంపదగా కలవాడు. మంచి కీర్తి వైభవాలు కలవాడు. ధనుర్వేద విద్యలో ఆరితేరినవాడు. మేఘంలా గంభీరమైనవాడు. దయకు సముద్రుని వంటివాడు. పుణ్యాత్ముడు. పండితులను గౌరవించేవాడు. సర్వశాస్త్రాలసారం తెలిసినవాడు. గర్వించిన శత్రురాజులనే ఏనుగుల పాలిట సింహం వంటివాడు. షట్చక్రవర్తులలో ఒకడు. నీతిమంతమైన పాలన చేసేవాడు. సత్యం తప్పనివాడు. మహాజ్ఞాని. సత్యవాక్పరిపాలకుడు.

సూర్యవంశస్థుడయిన త్రిశంకుని కుమారుడు. సాటిలేని విజ్ఞానం కలవాడు. సూర్యవంశమనే పాలసముద్రంలో పుట్టిన చంద్రుడు. ఆడినమాట తప్పని వాడు. దేవేంద్రా! రెండువేల నాలుకలు గల ఆదిశేషునికైనా ఈ హరిశ్చంద్రుని గుణగణాలు కీర్తించడం సాధ్యంకాదు. అతను సత్యస్వరూపుడు. అతని ఆలోచనలు కరుణతో నిండిఉంటాయి. హరిశ్చంద్రుడు ధర్మతత్పరుడు. ఆయన ప్రియంగా మాట్లాడతాడు. అబద్ధమనేది ఆయనకు తెలియదు.

ఇన్ని మాటలు చెప్పడం ఎందుకు? బ్రహ్మరాత తప్పినా, సూర్యుడు తూర్పున అస్తమించినా, మేరుపర్వతం భూమిలో కుంగినా, ఆకాశం ఊడి కిందపడినా, భూగోళం తలక్రిందులైనా, సముద్రాలు ఎండినా, వజ్రాయుధం పదును తగ్గినా హరిశ్చంద్రమహారాజు మాత్రం ఆడిన మాట తప్పడు.

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడటం

(అ) హరిశ్చంద్రుని గొప్పదనం గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.

(ఆ) ద్విపదరూపంలోని ఈ పాఠాన్ని లయబద్ధంగా రాగంతో పాడండి.

(ఇ) సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. ఈ కింది భావాలున్న పద్య పాదాలను పాఠంలో వెతికి రాయండి.**

(అ) హరిశ్చంద్రుడు వినయమే అలంకారంగా గలవాడు. వివేకం సంపదగా గలవాడు.

(ఆ) హరిశ్చంద్రుడు ఎల్లప్పుడు ప్రసన్నంగా ఉంటాడు. నీతిగా పరిపాలన చేస్తాడు.

(ఇ) త్రిశంకుని కుమారుడు సత్యాన్నే పలికేవాడు.

**2. కింది పద్యం చదవండి. భావంలో ఖాళీలు ఉన్నాయి. పూరించండి.**

**నుతజల పూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత**
**వ్రత! యొక బావిమేలు, మఱి బావులు నూఱిటికంటె నొక్క స**
**త్క్రతువది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండుమేలు, త**
**త్సుతశతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్.**

పై పద్యం శకుంతల దుష్యంతునితో చెప్పింది. సత్యవ్రతం యొక్క గొప్పదనాన్ని తెలిపే పద్యం ఇది.

స్వచ్ఛమైన జలం ఉన్న నూరు నూతులకన్నా ఒక ______________ మేలు.
అలాంటి వందబావులకన్నా ఒక ______________ మేలు. అలాంటి వంద ______________ ల
కన్నా ఒక ______________ ఉండటం మేలు. అలాంటి వందమంది ______________
ఉండటం కన్నా ఒక ______________ మేలు.

**3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.**

(అ) హరిశ్చంద్రుని గుణగణాలను కవి ఏ విధంగా వర్ణించాడు?

(ఆ) హరిశ్చంద్రుని గొప్పతనం గురించి వశిష్ఠుడు ఎవరితో చెప్పాడు? ఎందుకు చెప్పాడు?

(ఇ) హరిశ్చంద్రునికి ఉన్న విశిష్టతలు ఏవి?

(ఈ) అసాధారణాలైనవి కూడా సంభవించ వచ్చని కవి వేటిని పేర్కొన్నాడు? వీటిని ఏ సందర్భంలో పేర్కొన్నాడు?

© SCERT not to be republished

**4. కింది వాక్యాలకు సమానార్థాన్నిచ్చే వాక్యాలు గుర్తించండి.**

(అ) హరిశ్చంద్రుడు వివేకసంపన్నుడు, వినయభూషణుడు. (      )

(i) హరిశ్చంద్రుడు కేవలం వివేకసంపన్నుడు.

(ii) హరిశ్చంద్రుడు వినయభూషణుడే.

(iii) హరిశ్చంద్రునికి వివేకసంపదకన్న వినయభూషణం అధికం.

(iv) హరిశ్చంద్రునిలో వివేకసంపద, వినయభూషణం రెండూ సమానమే.

(ఆ) మేరువు గ్రుంకినా, మిన్ను వ్రాలినా హరిశ్చంద్రుడు అసత్యం పలకడు. (      )

(ఎ) మేరువుకుంగినా, ఆకాశం ఊడిపడ్డా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడడు.

(బి) మేరువు కుంగి, మిన్ను వాలినా, సత్యం పలుకుతాడు హరిశ్చంద్రుడు.

(సి) మేరువు కుంగిన, మిన్ను వాలకున్నా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడడు.

(డి) మేరువు కుంగినా మిన్ను వాలినా హరిశ్చంద్రుడు సత్యం పలకడు.

## III. స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

(అ) "హరిశ్చంద్రుణ్ణి షోడశ మహాదాన వినోది" అని వశిష్ఠుడు ఎందుకు అన్నాడు?

(ఆ) హరిశ్చంద్రునిలో మిమ్మల్ని ఆకట్టుకునే అంశాలేవి?

(ఇ) 'హరిశ్చంద్రుడు ఆడినమాట తప్పడు' అని తెలుసుకున్నారు కదా! ఆడిన మాట తప్పని వారు ఎలా ఉంటారో రాయండి.

(ఈ) 'మిన్ను వ్రాలినా' అని వశిష్ఠుడు హరిశ్చంద్రుని పరంగా ఉపయోగించాడు కదా! ఈ జాతీయాన్ని ఏ సందర్భంలో ఉపయోగిస్తారు?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

(అ) 'హరిశ్చంద్రుడు' పాఠ్యభాగ సారాంశం సొంతమాటల్లో రాయండి.

(ఆ) వివేకసంపన్నుడు, సత్యసంధుడు, విద్యాధికుడు, కరుణాపయోనిధి, విజ్ఞాననిధి అని హరిశ్చంద్రుణ్ణి కీర్తించారు కదా! మన సమాజంలోని వ్యక్తులు అందరు ఈ గుణాలతో ఉంటే ఈ సమాజం ఎలా ఉంటుందో ఊహించి రాయండి.

## IV. పదజాలం

**1. కింది పట్టికను పరిశీలించండి. అందులో హరిశ్చంద్రుని గుణగణాలకు సంబంధించిన పదాలున్నాయి. అయితే ఒక్కొక్క పదం రెండుగా విడిపోయింది. వాటిని కలిపిరాయండి. ఆ పదాల ఆధారంగా సొంత వాక్యాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| నీతి | శాలి | బొంకని | పాలకుడు | కరుణా |
| నిధి | విజ్ఞాన | సంధుడు | శరధి | దాన |
| భాగ్య | సత్య | చంద్రుడు | వినోది | వాడు |
| పయోనిధి | వివేక | వినయ | భూషణుడు | సంపన్నుడు |

ఉదా : నీతినిధి – నీతినిధియైన సర్పంచ్‌వల్ల గ్రామానికి మేలు జరుగుతుంది.

© SCERT not to be republished

**2. కింది పదాలు చదవండి. గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాక్యంలో ప్రయోగించండి.**

(అ) అడవికి కంఠీరవం రాజు.

(ఆ) త్రిశంకు నందనుడు హరిశ్చంద్రుడు.

(ఇ) ఆంజనేయుడు శరధి దాటాడు.

(ఈ) దేవతలకు రాజు సురేంద్రుడు.

(ఉ) భానుడు ప్రపంచానికి వెలుగును, వేడిని ఇస్తున్నాడు.

**3. కింది వాక్యాలు పరిశీలించండి. పర్యాయపదాలతో ఇలాంటి వాక్యాలు రాయండి.**

(అ) భానుకిరణాలు చీకట్లు పోగొడతాయి. ఆదిత్యుడు వెలుగుతో పాటు వేడిమినిస్తాడు. రవి మొక్కలకూ జంతువులకూ ప్రాణాధారం. సూర్యుడు లేకపోతే ఈ సమస్త జీవులు ఉండవు.

(ఆ) వానరులు లంకను చేరడానికి సముద్రాన్ని దాటాలి. ఇందుకోసం ఆ శరధి పై వారధి కట్టాలి. దీనికి నలుణ్ణి వినియోగించారు. నలుని నేతృత్వంలో వానరవీరుల సహాయంతో . అంబుధిపై వారధి తయారయింది. శ్రీరాముని వెంట వానరులు కడలి దాటి వెళ్లారు. సంద్రంలో ఆ వారధి ఈ నాటికీ కనిపిస్తుంది.

## V. సృజనాత్మకత

మహాభాగ్యశాలి, ధనుర్వేద విద్యాధికుడు, సర్వశాస్త్రార్థ కోవిదుడు, నీతిపాలకుడు, ధర్మపరాయణుడు, మహాసత్యవంతుడు అయిన హరిశ్చంద్రుని పాత్రకు ఏకపాత్రాభినయం తయారుచేయండి. ప్రదర్శించండి.

(లేదా)

హరిశ్చంద్రుని గుణగణాలను తెలిపే విశేషణాలు తెలుసుకున్నారు కదా! ఇలాంటి విశేషణాలను ఉపయోగించి ఎవరైనా ఒక గొప్ప నాయకుడి గురించి ఒక వ్యాసం రాయండి.

## VI. ప్రశంస

ఆడిన మాట తప్పకుండా తను చేస్తున్న వృత్తిలో నిజాయితీపరులైన వారివల్ల ప్రజలకు కలిగే మేలును ప్రశంసిస్తూ పత్రికకు లేఖ రాయండి.

(లేదా)

మీకు పద్యాలు తెలుసు కదా! ఈ పాఠం ద్వారా ద్విపదను గూడా తెలుసుకున్నారు కదా! ఇతర పద్యాలకూ ద్విపదకూ మధ్య ఉండే వ్యత్యాసాన్ని వివరించి మీకు నచ్చిన దాన్ని ప్రశంసిస్తూ రాయండి.

© SCERT not to be republished

## VII. భాషను గురించి తెలుసుకొందాం

### 1 కింది వాటిని పూరించండి.

| సంధి పదం | విసంధి | సంధిపేరు |
|---|---|---|
| (అ) | అన్న+తమ్ముడు+ లు | |
| (ఆ) గుణములు బొగడ | | |
| (ఇ) విద్యాధికుడు | | |
| (ఈ) | సుర+ ఇంద్ర | |
| (ఉ) తలపెల్ల | | |
| (ఊ) నల్ల గలువ | | |
| (ఋ) | వీడు + తడిసె | |
| (ౠ) కాలుసేతులు | | |

### 2. కింది పేరాలోని సంధి పదాలను గుర్తించి అవి ఏ సంధులో రాయండి.

విద్యార్థులందరూ ఆడుకుంటూండగా ఎగురుతున్న పక్షి కింద పడింది. ఆ పక్కనే ఉన్నవాళ్ళంతా దానివైపు పరుగెత్తారు. కాని పురుషోత్తముడనే పిల్లవాడు దాన్నిముందే పసిగట్టి నీళ్ళతోపాటు వెళ్ళి ఆ పక్షిపైన చల్లాడు. అది వెంటనే పైకెగిరి వెళ్ళింది. అందరతనిని మెచ్చుకొన్నారు.

### 3. అలంకారాలు

#### అ. వృత్త్యనుప్రాసాలంకారం

అలంకారాలు ప్రధానంగా రెండు రకాలు

(1.) అర్థాలంకారాలు (2.) శబ్దాలంకారాలు

ఉపమాది అలంకారాలు అర్థాలంకారాలు. వీటి గురించి కింది తరగతుల్లో తెలుసుకున్నారు కదా! ఇప్పుడు కొన్ని శబ్దాలంకారాలను గురించి తెలుసుకుందాం.

కింది వాక్యాలను చదవండి.

(1) "ఆమె' కడవతో వడి వడి అడుగులతో గడపను దాటింది."

(2) "చిట పట చినుకులు టపటపమని పడుతున్న వేళ"

మొదటి వాక్యంలో 'డ' అనే హల్లు

రెండవ వాక్యంలో 'ట' అనే హల్లు చాలాసార్లు వచ్చాయి.

© SCERT not to be republished

ఈ విధంగా,

ఒక హల్లును మళ్ళీ మళ్ళీ ఉపయోగిస్తే వినసొంపుగా ఉంటుంది. శబ్దంలో చమత్కారం ఇక్కడ ప్రధానంగా కనబడుతుంది. ఈ విధంగా శబ్దానికి ప్రాముఖ్యాన్ని ఇచ్చే అలంకారాలలో వృత్త్యనుప్రాస అలంకారం ఒకటి.

మరికొన్ని ఉదాహరణలు చూడండి.

(అ) బాబు జిలేబి పట్టుకొని దాబా పైకెళ్ళాడు.

(ఆ) గట్టుమీది చెట్టుకింద కిట్టు రొట్టెను లొట్టలేస్తూ తింటున్నాడు.

(ఇ) లక్ష భక్ష్యాలు తినేవాడికి ఒక భక్ష్యం లక్ష్యమా!

**ఒక హల్లుగాని, రెండు, మూడు హల్లులు గాని, వేరుగా ఐనా, కలిసి ఐనా, మళ్ళీ మళ్ళీ వచ్చినట్లయితే దాన్ని 'వృత్త్యనుప్రాస అలంకారం' అంటారు. "ప్రతిజ్ఞ" పాఠం చదవండి. వృత్త్యనుప్రాస అలంకారానికి చెందిన పదాలు / వాక్యాలు గుర్తించండి.**

### ఆ ఛేకానుప్రాసాలంకారం :-

కింది వాక్యం చదవండి.

**నీకు వంద వందనాలు**

పై వాక్యంలో 'వంద' అనే హల్లుల జంట వెంటవెంటనే అర్థ భేదంతో వచ్చింది. ఇక్కడ మొదట వచ్చి 'వంద' సంఖ్యను తెలుపుతున్నది. రెండోసారి వచ్చి 'వంద'నాలు – నమస్కారాలు అన్న అర్థాన్నిస్తున్నది.

ఈ విధంగా–

**హల్లులు జంట అర్థ భేదంతో వెంటవెంటనే వస్తే దానిని 'ఛేకానుప్రాస అలంకారం' అంటారు.**

ఇలాంటివే మరికొన్ని ఉదాహరణలు రాయండి.

### ప్రాజెక్టు పని

సత్యం గొప్పతనం తెలుసుకున్నారు కదా! సత్యాన్ని తెలిపే కథలను, పద్యాలను సేకరించండి. మీ పాఠశాలలో ప్రదర్శించండి.

(లేదా)

హరిశ్చంద్రుని కథను చదివి అతని గొప్పతనాన్ని వర్ణించే వాక్యాలను చార్ట్‌పై రాసి ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా ?

1. పాఠ్య భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
2. ద్విపదను రాగయుక్తంగా భావయుక్తంగా చదవగలను. ఔను / కాదు
3. పాఠంలోని భావాన్ని సొంతంగా రాయగలను. ఔను / కాదు
4. "సత్యవాక్కు" గొప్పతనం గురించి వ్యాసం రాయగలను. ఔను / కాదు

**మనం దేనికి అర్హులమో అదే మనకు లభిస్తుంది.**

© SCERT not to be republished